
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 21 డిసెంబరు 2024



వాయుగండం

- బలపడిన అల్పపీడనం
- రోజంతా కురిసిన వర్షం
- నీట మునిగిన వరి కుప్పలు
- అన్నదాతల ఆక్రందన..
- అల్లకల్లోలంగా సముద్రతీరం



హరిపురం: పుచ్చపాడు వద్ద తడిసిన వరి పంటను చూపిస్తున్న రైతు



హరిపురం: బుడార్సింగి వద్ద నీట మునిగిన వరిపంటకు మొలకలు



శ్రీకాకుళంలో కురుస్తున్న వర్షం

శ్రీకాకుళం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయు'గండం'గా మారింది. ఇప్పటికే మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులు విలవిల్లాడుతున్నారు. వాయుగుండం ప్రభావంతో శుక్రవారం కూడా రోజంతా వర్షం కురవడంతో జిల్లా ప్రజలు, రైతులు అవస్థలకు గురయ్యారు. శ్రీకాకుళం, పలాస, నరసన్నపేట, పోలాకి, ఆమదాలవలస, జి.సిగడాం, మందస, గార, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో కోతకోసిన వరి కుప్పలు నీట మునిగాయి. కొన్నిచోట్ల కళ్లాల్లో టార్పాలిన్‌లు కప్పినా పంటంతా నానిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వరుస తుఫాన్‌లు, ఆపై అల్పపీడనం.. అకాల వర్షాలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. అలాగే సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. భారీ ఈదురుగాలులు వీస్తుండడంతో తీరప్రాంత వాసులు వణికిపోతున్నారు.

నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం..

జిల్లా అంతటా శుక్రవారం భారీవర్షపాతం నమోదైంది. పలు పనుల నిమిత్తం శ్రీకాకుళం నగరానికి వచ్చిన ప్రజలు.. వాహనదారులు.. వర్షంలోనే రాకపోకలు సాగించారు. వాయుగుండం ప్రభావంతో శనివారం కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికార యంత్రాంగం ప్రకటించింది. రైతులు అప్రమత్తమై టార్పాలిన్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించింది.

నీటిలోనే వరి పంట

హరిపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం రోజంతా వాన కురిసింది. వరిపొలాల్లో నీరు చేరి వరిపైరు మొత్తం తడిసి ముద్దయింది. యంత్రాలతో కోసిన వరిచేను ధాన్యం రాశులు.. పరదాల్లో భద్రపరిచినవన్నీ నీటిలోనే ఉన్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మందస మండలంలో బుడార్సింగి, దేవుపురం, చిక్కిడిగాం, భోగాపురం, పొత్తంగి తదితర గ్రామాల పరిధిలో మూడు రోజులుగా వరిపైరు నీటిలో తడవటంతో సాంబమసూరు, సీఆర్ ధాన్యానికి మొలకలు వచ్చాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నోటికాడికి వచ్చిన పంట నీటిపాలైందని ఆవేదన చెందుతున్నారు.

ముందుకొచ్చిన తీరం...

సముద్రంలో రాకాసి అలలు ముంచుకొస్తుండటంతో తీర ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. రెండు రోజులుగా మత్స్యకారులు సైతం వేటకు వెళ్లక తీరంలోనే కాలం వెళ్లదీస్తున్నారు. మందస మండలంలో రట్టి, దున్నూరు, గంగువాడ వద్ద సముద్రం సుమారు 50 మీటర్లు ముందుకు రావటంతో తీరప్రాంత వాసులు ఆందోళనకు గురవుతున్నారు.

చెరువును తలపించిన రహదారి..

హిరమండలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హిరమండలంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రహదారిపై వర్షపు నీరు ఇలా నిలిచి చెరువును తలపిస్తోంది. అలికాం-బత్తిలికి ప్రధాన రహదారి ఇదే. ఈ మార్గం గుండా నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరింది. కనీసం నడవడానికి కూడా వీలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గత రెండేళ్లుగా ఈ రహదారి మరమ్మతులకు గురైనా అధికారులు శాశ్వత పనుల నిర్వహణపై శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రహదారిని బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.



హిరమండలం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చెరువులా మారిన ప్రధాన రహదారి

జిల్లాలో శుక్రవారం నమోదైన వర్షపాతం (మిల్లీమీటర్లలో)..

గార	30.0
సంతబొమ్మాళి	31.25
కోటబొమ్మాళి	29.0
టెక్కలి	28.0
కవిటి	28.25
రణస్థలం	25.5
ఇచ్ఛాపురం	23.5
లావేరు	22.75
పోలాకి	21.75
సోంపేట	21.75
జలుమూరు	21.0
కంచిలి	20.75
జి.సిగడాం	19.75
నరసన్నపేట	19.75
ఎల్.ఎన్.పేట	19.5
ఎచ్చెర్ల	19.0
సారవకోట	18.75
హిరమండలం	18.5
హిరమండలం	18.0
శ్రీకాకుళం	16.75
బూర్జ	16.75
మెళియాపుట్టి	16.5
ఆమదాలవలస	15.75
మందస	15.25
పాతపట్నం	15.5
పొందూరు	14.75
కొత్తూరు	13.75
సరుబుజ్జిలి	10.75
పలాస	6.5

పంట నష్టం లేకుండా ముందస్తు చర్యలు

- రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో పండిన వరిపంట నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామ'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన ధాన్యం సేకరణలో కొంత జాప్యమైంది. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తడిచి ముద్దయిన, రంగు మారిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. పొలాల్లో గల వరిపంట సురక్షితంగా ఉండేందుకు టార్పాలిన్లు సరఫరా చేస్తున్నాం. అవసరమైన రైతులు తహసీల్దార్లను సంప్రదించాలి. లోతట్టు ప్రాంతాలకు సంబంధించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా జలవనరుల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాం. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశాం. జేసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పని చేస్తోంది. రైతులకు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రథమ కర్తవ్యమ'ని స్పష్టం చేశారు.

ఇద్దరు సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు

- నిధులు దుర్వినియోగమే కారణం

పొందూరు/కంచిలి, డిసెంబరు 20: నిధులు దుర్వినియోగం నేపథ్యంలో జిల్లాలో ఇద్దరు సర్పంచ్‌ల చెక్ పవర్‌లు రద్దయ్యాయి. పొందూరు మండలం పెనుబర్తి పంచాయతీ సర్పంచ్ తమ్మినేని ఝాన్సీ చెక్ పవర్‌ను రద్దు చేసినట్లు ఎంపీడీవో ఎం.మన్మథరావు తెలిపారు. 'పంచాయతీ ఖాతా నుంచి తీర్మానం, పంచాయతీ కార్యదర్శి సంతకం లేకుండా రూ.లక్ష నిధులను సర్పంచ్ ఝాన్సీ సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ అధికారికి, కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై నవంబరు 28న పెనుబర్తిలో డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. వార్డు సభ్యుల ఆరోపణలు రుజువు కావడంతో సర్పంచ్ ఝాన్సీ చెక్‌పవర్‌ను డీపీవో రద్దు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశార'ని ఎంపీడీవో తెలిపారు.

- కంచిలి మండలం ఎం.ఎస్.పల్లి సర్పంచ్ కొనపల సురేష్‌కుమార్.. నిధులు దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలడంతో చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేశామని ఈవోపీఆర్‌డీ కె.ఈశ్వరి తెలిపారు. '2021 నుంచి 2024వ ఆర్థిక సంవత్సరం వరకు పంచాయతీ పరిధిలో చేసిన వివిధ పనులకు సంబంధించి సరైన రశీదులు కానీ, రిజిస్టర్ కానీ నమోదు చేయలేదు. సర్పంచ్ నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు గ్రామస్థులు గతంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అశోక్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టి.. అవకతవకలు గుర్తించారు. ఉన్నతాధికారుల సంతకాలు లేకుండా నిధులు ఉపసంహరించడమే కాకుండా.. దీనికి సరైన రశీదులు చూపకపోవడాన్ని తప్పుపట్టారు. దీనిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకునే వరకు తాత్కాలికంగా సర్పంచ్ సురేష్‌కుమార్ చెక్ పవర్ రద్దు చేస్తున్నామ'ని ఈవోపీఆర్‌డీ వెల్లడించారు.

నేడు ప్రాజెక్టు చైర్మన్ల ఎన్నిక

- వైస్‌చైర్మన్ల నియామకం కూడా..
- పూర్తికానున్న సాగునీటి సంఘాల పోరు ప్రక్రియ



వంశధార ఎడమ ప్రధాన కాలువ

నరసన్నపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో చివరి ఘట్టానికి సమయం ఆసన్నమైంది. మూడు దశల్లో జరిగే ఈ ఎన్నికల్లో సాగునీటి వినియోగదారుల సంఘం(డబ్ల్యూయూఏ) డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఎన్నికలు పూర్తయ్యాయి. ఇక కీలకమైన వంశధార, నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఈ నెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)లకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు నిర్వహించారు. వంశధార ప్రాజెక్టు పరిధిలో జిల్లాలో పర్లాం, నరసన్నపేట, పోలాకి, గోవిందపురం, మేఘవరం, నౌపడ, వజ్రపుకొత్తూరు, సింగుపురం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, అంపోలు డీసీలు ఉన్నాయి. ఇటీవల డీసీ చైర్మన్ ఎన్నికల్లో పర్లాం డీసీ చైర్మన్‌గా కింజరాపు సత్యనారాయణ, నరసన్నపేటకు శిమ్మ చంద్రశేఖర్, పోలాకికి మిరియపల్లి వెంకట అప్పలనాయుడు, గోవిందపురానికి కర్రి అప్పారావు, మేఘవరానికి కోరాడ నాగరాజు, నౌపడకు మల్ల బాలకృష్ణ, వజ్రపుకొత్తురుకు గోనప నిరంజన్, సింగుపురానికి అరవల రవీంద్రబాబు, ఎల్.ఎన్.పేటకు డీసీ చైర్మన్‌గా ఒమ్మి ఆనందరావు, సరుబుజ్జిలికి పేడాడ వెంకట రమణమూర్తి, అంపోలు డీసీ చైర్మన్‌గా వడ్డిరాజు సింహగిరి ఎంపికయ్యారు. వంశధార ప్రాజెక్టు చైర్మన్ పదవి కోసం నౌపడ డీసీ చైర్మన్ మల్ల బాలకృష్ణ తీవ్ర ప్రయత్నాలు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్ల బాలకృష్ణ పీసీ చైర్మన్‌గా వ్యవహరించారు. నరసన్నపేట నియోజకవర్గం పరిధిలో పర్లాం, నరసన్నపేట, పోలాకి మూడు డీసీలు ఉండటంతో తొలుత ఆశావాహులు చైర్మన్ పదవి కోసం ప్రయత్నించారు. అయితే శ్రీకాకుళం ఎంపీ, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కుటుంబానికి అనుయాయునిగా (మిగతా 6వ పేజీలో..)

ఎట్టకేలకు సర్పంచ్ సుజాత రాజీనామా



టెక్కలి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ సుజాత ఎట్టకేలకు శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ డీపీవో కె.భారతికి లేఖ పంపారు. 2021లో తాను వైసీపీ మద్దతుతో సర్పంచ్‌గా ఎంపికయ్యానని, వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇందులో ఎవరి బలవంతం లేదని, ఇది నా అంగీకారంతోనే రాజీనామా చేస్తున్నానన్నారు. ఇదిలా ఉండగా సుజాత టెక్కలి రాజా వీధి డీలర్‌గా ఓవైపు వ్యవహరిస్తూ మరోవైపు టెక్కలి సర్పంచ్‌గా కొనసాగడంపై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి విచారణకు ఆదేశించడం, ఆమె నుంచి రెవెన్యూ అధికారులు సంజాయిషీ లేఖను తీసుకున్నారు. దీంతో ఎట్టకేలకు సర్పంచ్ పదవికి ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది.

సిక్కోలులో శ్రీలీల సందడి

శ్రీకాకుళంలో హీరోయిన్ శ్రీలీల సందడి చేశారు. శుక్రవారం జీటీ రోడ్డులో సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమె 'హలో శ్రీకాకుళం' అంటూ అభిమానులకు అభివాదం చేశారు. అభిమానుల కోరిక మేరకు.. ఇటీవల ఆమె నటించిన పుష్ప-2 సినిమాలో 'కిస్.. కిస్.. కిస్.. కిస్సిక్' పాటకు తనదైన స్టైల్‌లో స్టెప్ వేసి అలరించారు. అలాగే 'డ్రగ్స్ వద్దు బ్రో' బ్రోచర్‌ను విడుదల చేసి.. మత్తుకు దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు.



7 లో

న్యూస్ బాక్స్

మరో 6 నెలలు

- పీఏసీఎస్‌ల కమిటీలకు గడువు పెంపు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

6 లో



తీరంలో నిత్యం నిఘా ఉండాలి

- కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీ రవివర్మ

8 లో

సీసీ ఫుటేజీలు పరిశీలిస్తే.. వాస్తవాలు వెలుగులోకి?

- పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదంపై అధికారుల ఆరా

మస్తర్ల మాయాజాలానికి చెక్!

- 'ఉపాధి'లో ప్రత్యేక విభాగాల ఏర్పాటు
- కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- విజిలెన్స్ ద్వారా ఆకస్మిక తనిఖీలు



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

మెళియాపుట్టి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో బినామీ మస్తర్ల కట్టడికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతంలో జరిగిన మోసాల దృష్ట్యా.. వాటికి చెక్ పెట్టేందుకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనుంది. విజిలెన్స్ అధికారుల ద్వారా ఆకస్మిక తనిఖీలకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాలో సుమారు 4.3లక్షల ఉపాధిహామీ పథకం జాబ్ కార్డుల ఉన్నాయి. ఇందులో 3.79 లక్షలు యాక్టివ్‌గా ఉన్నాయి. మొత్తం 7.36 లక్షల మంది సభ్యులు ఉండగా, 6.03 లక్షల మంది మాత్రమే రోజూ ఉపాధి పనులు చేస్తున్నట్టు సమాచారం. ఉపాధిహామీలో 46 రకాల పనులు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించాయి. దీంతో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు అనుకూలంగా ఉన్నవారి మస్తర్లు వేసి, వేతనంలో సగం డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా రూ.లక్షలు స్వాహా చేశారని తెలుస్తోంది. ఆడిట్‌కు వచ్చిన అధికారులను సైతం వారు మేనేజ్ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పంచాయతీల్లో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్ల మాయాజాలం గతంలో బయటపడటంతో వాటిని కట్టడి చేయాలని ఉన్నతాధికారులు భావించారు. సాంకేతిక మార్పులు చేసినా బినామీ మస్తర్లను కట్టడి చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మస్తర్ల మాయజాలానికి చెక్ పెట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించింది.

ఫిర్యాదులపై చర్యలు శూన్యం..

మెళియాపుట్టి మండలంలోని ఇలాపురం పంచాయతీలో ఒడిశాలో ఉన్నవారి పేర్లతో గతంలో జాబ్ కార్డులు తయారు చేసి (మిగతా 6వ పేజీలో..)

బినామీల కట్టడికి అవకాశం




బినామీ మస్తర్లను కట్టడి చేయటానికి ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న విధానం దోహదపడుతుంది. ఇకపై బినామీ మస్తర్లకు అవకాశం ఉండదు. పనుల పరిశీలనకు విజిలెన్స్‌ను ఏర్పాటు చేయటానికి ఉత్తర్వులు ఇప్పటికే వెలువడ్డాయి.

\- ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి

వీడని వర్షం.. అపార నష్టం

- పంట సంరక్షణకు పడరాని పాట్లు
- క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన
- ఏకధాటిగా వర్షంతో జనం ఇక్కట్లు


జి.సిగడాం: జాడ వద్ద నీటిలోనే వరి చేను కుప్పలు


ఎల్ఎన్‌పేట: కృష్ణాపురం సమీపంలో పెసరపంటలో నిలిచిన వర్షపు నీరు


గార: వత్సవలస వద్ద వరికుప్పలపై పరదాలు కప్పిన దృశ్యం

(ఆంధ్రజ్యోతి బృందం)

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో సిక్కోలు తడిసి ముద్దయింది. శుక్రవారం రోజంతా ఏకదాటిగా కురిసిన వర్షం అన్నదాత ఉసురుతీసినట్టయింది. ఇప్పటికే మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు అరుగాలం కష్టపడి పండించిన పంట తడిసి పాడైంది. ఇంకా పొలాల్లోనే నానుతోంది. పంట సంరక్షణకు అన్నదాతల పాట్లు అన్నీఇన్నీకావు. కళ్లాల నుంచి ధాన్యం తరలించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. వర్షాల బారిన పడిన పంటను వ్యవసాయాధికారుల పరిశీలించి, పంట సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇదిలా ఉండగా రోజంతా వర్షం కురుస్తుండటంతో ఎక్కడి కక్కడ వరదనీరు నిలిచింది. రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. ఇళ్లకే జనం పరిమితమయ్యారు.


నందిగాం: ధాన్యం బస్తాలను భద్రపరుస్తున్న రైతు


కంచిలి: రైతులతో మాట్లాడుతున్న అధికారులు


సంతబొమ్మాళి: కాపుగోదాయవలసలో వర్షపునీటిలోనే చేను


జలుమూరు : కోనసింహాద్రిపేట వద్ద వరి కుప్పలకు కప్పిన టార్పాలిన్లు


పలాస రూరల్: బంటుకొత్తూరు వద్ద నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


పోలాకి: నూర్చిన ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలించే పనిలో బిజీగా ఉన్న రైతులు


వజ్రపుకొత్తూరు: సీతాపురంలోని పంట పొలాల్లో వరి కుప్పల సంరక్షణలో రైతులు

నేడు ప్రాజెక్టు చైర్మన్ల ఎన్నిక

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న శ్రీకాకుళం మండలం నైరా పంచాయితీకి చెందిన సింగుపురం డీసీ చైర్మన్ అరవల రవీంద్రబాబును పార్టీ అధిష్ఠానం పీసీ చైర్మన్‌గా నియమించాలని సంకేతాలు జారీ చేసింది. దీంతో దాదాపు వంశధార పీసీ చైర్మన్ ఖరారైనట్టేనని పేర్కొంటున్నారు. ఇక వైస్ చైర్మన్ పదవి విషయం.. పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఇంకా ఊగిసలాటలో ఉంది.

● నారాయణపురం ఆనకట్ట పరిధిలో కొర్లకోట, అరసవల్లి, తాడివలస, గోరింట, పొన్నాడ డీసీలు ఉన్నాయి. కొర్లకోట డీసీ చైర్మన్‌గా సనపల ఢిల్లీశ్వరరావు, అరసవల్లి డీసీ చైర్మన్‌గా శిమ్మ శ్రీనివాసరావు, తాడివలస చైర్మన్‌గా గురుగుబిల్లి రాణప్రతాప్, గోరింట దుప్పల జగన్మోహన్‌రావు, పొన్నాడ డీసీ చైర్మన్‌గా పంచిరెడ్డి కృష్ణారావును ఎన్నుకున్నారు. ఈ ఐదుగురులో ముగ్గురు బలపరిచిన వ్యక్తి నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్‌గా ఎంపిక కానున్నారు. నారాయణపురం ఆనకట్ట పరిధిలో డీసీలు ఎచ్చెర్ల, ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. అయితే శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలోని సింగుపురం డీసీ చైర్మన్ అరవల రవీంద్రబాబుకు వంశధార ప్రాజెక్టు చైర్మన్‌గా దాదాపు ఖరారైంది. దీంతో ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన కోర్లకోట డీసీ చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావుకు చైర్మన్, ఎచ్చెర్ల నియోజవర్గం పొన్నాడ డీసీ చైర్మన్ పంచిరెడ్డి కృష్ణారావుకు వైస్ చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

వృథాగా సర్వే రాళ్లు

గార, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల హద్దులు నిర్ణయించడానికి ఉద్దేశించి లక్షలాది రూపాయ వ్యయంతో తెప్పించిన జగనన్న సర్వే రాళ్లు కళింగపట్నంలో ఆర్‌బీకే ఎదుట పడి ఉన్నాయి. వందలాది రాళ్లు తెప్పించిన అధికారులు వాటిని వినియోగించకపోవడంతో అవి వృథాగా అక్కడ పడి ఉన్నాయి. వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి.


కళింగపట్నం రైతు సేవా కేంద్రం వద్ద పడివున్న సర్వేరాళ్లు

వరి పంటను కాపాడుకోండి ఇలా..


నరసన్నపేట : చిక్కాలవలస వద్ద రోడ్ల మీద నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో సునీత, వీఆర్వో చక్రవర్తి తదితరులు

నరసన్నపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పడిన వర్షాలకు జరిగిన నష్టాన్ని నివారించేందుకు తగు జాగ్రత్తలను పాటించడం ద్వారా నష్ట నివారణ తగ్గించుకోవచ్చని వ్యవసాయశాఖ ఏడీ రవీంద్ర భారతి, ఏవో సునీత తెలిపారు. శుక్రవారం చిక్కావలస, మామిడివలస తదితర గ్రామాల్లోని వరి చేనును వారు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ●కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే, గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలి. ● పొలంలో నీరు నిలిస్తే పనలను గట్లపైకి తీసుకువచ్చి వాటిని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లాలి. ● కళ్లాల్లో నూర్చిన ధాన్యం ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడువాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడిఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తదు. ● కోసిన పూర్తిగా ఆరని పనలపై ఎకరాకు 2.5 కిలోల ఉప్పును పనలపై చల్లాలి. కింది భాగంలో నీరు చేరితే ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి. నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకోవాలి. ● కోత చేయని వరి చేను వాలితే మొక్కలు మొలవకుండా ఉండేందుకు నీరు బయటకు తీయాలి. ఉప్పు నీరు పిచికారీ చేయాలి.

మస్తర్ల మాయజాలానికి చెక్!

(ఐదో పేజీ తరువాయి)

బినామీ మస్తర్లు వేసి నిధులు స్వాహా చేశారు. దానికి సంబంధించిన ఆధారాలతో కూడిన జాబితాను ఇటీవల మండలంలోని నిర్వహించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీల్లో సర్పంచ్ గవిరేష్ అధికారులకు అందజేశారు. అయినప్పటికీ అక్రమార్కులపై చర్యలు శూన్యం.

● మెళియాపుట్టి మండలంలోని కేరాశింగి, గోకర్ణపురం, భరణికోట పంచాయతీల్లో అధికంగా మస్తర్ల దిద్దుబాట్లు ఉన్నట్టు సామాజిక తనిఖీల్లో ఆడిట్ సిబ్బంది గుర్తించారు. అయినప్పటికీ వైసీపీ నాయకుల మద్దతుతో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించారనే విమర్శలున్నాయి.

● గత ఐదేళ్లలో పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చెల్లింపులకు ఉద్దేశించి ఎన్నో సాంకేతిక మార్పులు తీసుకువచ్చినా అడ్డుకట్ట వేయలేకపోయాయి. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దీనిపై దృష్టి సారించారు. ఆడిట్‌లో నిధులు దుర్వినియోగమైనట్టు గుర్తిస్తే కేసులు నమోదు, జైలులో పెడతామని హెచ్చరించారు. అందుకు తగ్గట్టు మస్తర్ల పరిశీలనకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

కట్టడికి చర్యలు ఇలా..

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలను పూర్తిస్థాయిలో అరికట్టడానికి ప్రత్యేక పర్యవేక్షణ విభాగాలను నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రస్థాయి, జిల్లా విజిలెన్స్ విభాగాల ఆధ్వర్యంలో కొంతమంది అధికారులు పని చేయనున్నారు. మస్తర్లు నమోదును ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. ఏపీవో మండలంలో రోజూ రెండు గ్రామాలు, ఏపీడీ వారంలో రెండు రోజులు పని ప్రదేశాలను తనిఖీ చేయనున్నారు. ఎంపీడీవో సైతం పనులు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించి మస్తర్లను తనిఖీ చేస్తారు. గతంలో ఇలాంటి కార్యక్రమాలు అడపాదడపా నిర్వహించినా.. మస్తర్ల మాయాజాలాన్ని నిలువరించ లేకపోయారు. దీంతో కూటమి ప్రభుత్వం యాప్ ద్వారా ఏ రోజు ఎక్కడకు వెళ్లాలో అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేసి అక్కడ జరుగుతున్న పనుల తీరుపై పూర్తిస్థాయిలో పర్యవేక్షించే అవకాశం ఉంది.

భళా చిత్రకళ

● చిత్రకారుడిగా రాణిస్తున్న రాంబాబు


బొమ్మను గీస్తూ.. రాంబాబు




దేవతా మూర్తుల గ్లాస్ పెయింటింగ్స్

ఎచ్చెర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి)

సిక్కోలు పేరు చెప్పగానే వడ్డాది పాపయ్య, కూర్మాపు నర్శింహం, సీఎస్ఎన్ పట్నాయక్ వంటి వారెందరో చిత్రకారులు, శిల్ప కళాకారులు గుర్తొస్తారు. వీరంతా సిక్కోలు ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింపజేశారు. వీరి స్ఫూర్తితో యువ చిత్రకారుడు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీ పాత పొన్నాడకు చెందిన రాంబాబు చిత్రకళా ప్రపంచంలో తన కంటూ ఓ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. విభిన్న రీతుల్లో చిత్రాలను గీసి తన కంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ఊహ తెలిసిన నుంచే..

కుటుంబ నేపథ్యం కారణంగా రాంబాబుకు బాల్యం నుంచే మట్టితో బొమ్మలు తయారు చేయడం అలవాటు.ఊహ తెలిసాక విభిన్న రీతుల్లో బొమ్మలను తయారు చేయడం అలవాటు చేసుకున్నారు. డిగ్రీ తర్వాత డ్రాయింగ్ టీచర్ ట్రైనింగ్ పూర్తిచేసిన రాంబాబు ఇక్కడికి సమీపంలోని బొంతలకోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో వొకేషనల్ (డ్రాయింగ్) టీచర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారు.

పర్యావరణ హితంగా బొమ్మల తయారీ..

వినాయక చవితి, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు మట్టితోనే బొమ్మలను తయారుచేసి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నారు. నాగావళికి ఆనుకుని పాత పొన్నాడ గ్రామం ఉండడంతో అక్కడ సేకరించిన మట్టితో వివిధ రకాల ఆకృతులతో బొమ్మలను తయారు చేస్తుంటారు. అలాగే ట్రాన్స్‌పరెంట్‌గా బొమ్మలను గీసి అబ్బురపరుస్తున్నారు. తన చేతిలోని నైపుణ్యానికి మరింత పదునుపెట్టి విభిన్న చిత్రాలను గీయడంతో అందరిచే శ బాష్ అనిపించుకుంటున్నారు. డ్రాయింగ్ టీచర్లు యర్రా సత్యనారాయణ, పి.విజయకుమార్ పాణిగ్రాహి మార్గదర్శకంలో తన సోదరుడు రామకృష్ణ సహకారంతో చిత్రాలను గీయడంలో రాంబాబు ప్రత్యేకతను చాటుతున్నారు.

గ్లాస్ పెయింటింగ్‌లోనూ ప్రతిభ..

దేవతామూర్తుల బొమ్మలను గీయడంలో రాంబాబు ఆయనకు ఆయనే సాటి అని నిరూపించుకున్నారు. వినాయకుడు, బుద్ధుడు, అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి, కుమారస్వామి, లక్ష్మీదేవి తదితర బొమ్మలను మట్టితో తయారు చేయడంతో పాటు అందంగా రంగులు అద్దడం ఆయన ప్రత్యేకత. దేవుళ్ల చిత్రాలను గ్లాస్ పెయింటింగ్ చేసి మంచి గుర్తింపు పొందారు. జాతీయ నాయకుల చిత్రాలను కూడా జీవకళ ఉట్టిపడేలా గీస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలతో బొమ్మలు గీయడం అలవాటు చేస్తున్నారు. రాంబాబు కుంచె నుంచి మరెన్నో అందాలు జాలువారాలని ఆశిద్దాం.



మరో 6 నెలలు

● పీఏసీఎస్‌ల కమిటీలకు గడువు పెంపు ● ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నరసన్నపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం మరో ఆరు నెలలు గడువు పెంచింది. ఎన్నికలు నిర్వహించే వరకూ పాత కమిటీలే కొనసాగించనున్నట్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో 49 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలను నిర్వహించకుండా తిసభ్య కమిటీలను ఏర్పాటు చేసింది. అప్పట్లో వైసీపీ నాయకులనే ఈ పదవుల్లో నియమించింది. సహకార సంఘాల గడువు ఈ నెల 20తో ముగిసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో.. కూటమి నాయకులు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. వీటితోపాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం చాలా మంది ఆశిస్తున్నారు. కాగా.. ఈ నెల 21 నుంచి మరో ఆరు నెలల వరకు ప్రస్తుత త్రిసభ్య కమిటీలే కొనసాగుతాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ ద్వారా సహకార సంఘాల కార్యవర్గ సభ్యులుగా నియమించి.. ఎక్కువ మందికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. త్రిసభ్య కమిటీల ద్వారా కేవలం ముగ్గురికి మాత్రమే అవకాశం లభిస్తుంది. ఎన్నికల ప్రక్రియ ద్వారా అయితే.. ఒక్కో ప్రాథమిక సహకార సంఘం పరిధిలో 12 మంది సభ్యులు వరకూ డైరెక్టర్లు ఉంటారు. ఇలా జిల్లాలో 49 ప్రాథమిక సంఘాల పరిధిలో సుమారు 600 మంది కూటమి నేతలకు ఏదో ఒక పదవి ఇవ్వవచ్చనే ప్రభుత్వం భావిస్తోంది. ఆరు నెలల వరకూ పాత కమిటీలను కొనసాగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నా.. సంక్రాంతి తర్వాత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నీటి సంఘాల ఎన్నికల మాదిరే.. 'పీఏసీఎస్'ల ప్రక్రియ కూడా చేపట్టనుందని భావిస్తున్నారు.

నేడు జడ్పీలో క్రిస్మస్ హైటీ వేడుకలు

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 11.00 గంటలకు క్రిస్మస్ హైటీ వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి క్రిస్టియన్ పెద్దలు, జిల్లాలోని ఆయా సంఘాలకు చెందిన సంఘకాపరులు, మైనార్టీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కంచిలి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దేవదాస్ రెడ్డి అధ్యక్షతన శనివారం ఉదయం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండల స్థాయి అధికారులంతా తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరుకావాలని కోరారు.

నేడు భగవద్గీత పఠన పోటీలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9గంటల నుంచి భగవద్గీత పఠన పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

నేడు అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం

అరసవల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలో అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 6.45 నుంచి 8.00 గంటల వరకు అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని జరుపుతారు. కార్యక్రమంలో భాగంగా సామూహిక ధ్యానం, యోగా, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయని డీఆర్వో అప్పారావు తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్చువల్‌లో ల్యాబ్ వర్క్‌షాప్

గుజరాతీపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పురుషులు, మహిళా కళాశాల సంయుక్తంగా సైన్స్ అధ్యాపకులకు వర్చువల్‌లో ల్యాబ్ వర్క్‌షాప్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమృత విశ్వవిద్యాలయ పీఠం నుంచి రిసోర్స్ పర్సన్ సనీష్, నిజిన్‌లు హాజరయ్యారు. వర్చువల్ ల్యాబ్‌లు వర్సిటీలకు సంప్రదాయ ల్యాబ్‌లకు ఉపయోగకరమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తాయని, వర్చువల్ పదేపదే అభ్యాసం చేయడం ద్వారా విద్యార్థులు అనేక నూతన భావనలను స్పష్టంగా అర్థం చేసుకోవడంలో సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్ర, కోర్సు కన్వీనర్ టి.స్వర్ణలత, బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సద్వినియోగం చేసుకోవాలి

గుజరాతీపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని వర్గాల వారితో సమానంగా ట్రాన్స్ జెండర్స్‌కు హక్కులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాయంలో శుక్రవారం ట్రాన్స్ జెండర్స్‌తో సమావేశం నిర్వహించారు. ట్రాన్స్ జెండర్స్‌కు అన్ని పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్ ఏబిల్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత, జిల్లా ఉపాధి అధికారి కె.సుధా, స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారి వి.సాయికుమార్, న్యాయవాది ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలు పరిశీలన

కంచిలి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తడిచిన పంట పొలాలను శుక్రవారం ఉదయం తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్, ఏవో ధనుంజయం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. శనివారం నుంచి వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉన్నందున కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. టార్పాలిన్లు అవసరమైన రైతులు రూ.650లు చెల్లించి తీసుకోవాలని సూచించారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

అరసవల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో సృజనాత్మకత వెలికితీసి, వారిని ప్రోత్సహించాలి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రతీ నెల మూడో శుక్రవారం స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా జడ్పీ సమావేశ మందిరంలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి వినతలను స్వీకరించారు. కార్యాక్రమంలో డీఆర్వో అప్పారావు, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ కవిత తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి బ్యాంకు సేవలు విభజన

అరసవల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర మధ్య ఏపీజీవీబీ బ్యాంకు సేవల విభజన జరగనుందని రీజనల్ మేనేజర్ లావేటి అనంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 278 శాఖలు ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు పేరుతో రాష్ట్రంలో వచ్చే నెల 1 నుంచి యథావిధిగా సేవలు కొనసాగుతాయన్నారు. విభజన పక్రియ కారణంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండవని తెలిపారు.

అంబేడ్కర్‌పై విమర్శలు సరికాదు

ఆమదాలవలస, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించడం సరికాదని, అది రాజ్యాంగాన్ని అగౌరవపర్చడమే అవుతుందని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు వేదిక కన్వీనర్ బొడ్డేపల్లి మోహన్‌రావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో దేశవ్యాప్తంగా అమిత్‌షా వ్యాఖ్యలను నిరసించాల్సిన అవసరం ఉందన్నారు.

పాఠశాలల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రైవేట్ ఉన్నత పాఠశాలల ఏర్పాటుతో పాటు పాఠశాలల అప్‌గ్రేడేషన్‌కు ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో తిరుమల చైతన్య కోరారు. పాఠశాల ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య, అప్పటికే నడపబడుతున్న పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను ఆధారంగా అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి జనవరి 26వ తేదీలోగా అనుమతులను మంజూరు చేస్తామన్నారు. రెన్యువల్ కోసం గడువులోగా దరఖాస్తులు చేసుకోకుంటే గుర్తింపును రద్దు చేస్తామన్నారు.

క్రీడా పోటీలు వాయిదా

ఎచ్చెర్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో మూడు రోజుల పాటు నిర్వహించాల్సిన అంతర పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ -2024 శుక్రవారం జరగాల్సిన మూడో రోజు పోటీలు వర్షం కారణంగా వాయిదా వేసినట్టు శుక్రవారం నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర ఫైనల్ పోటీలు ఇంకా జరగాల్సి ఉందన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు.

క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ వాయిదా

ఎచ్చెర్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరపున అథ్లెటిక్ విభాగంలో పురుషులు, మహిళలు అంతర యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ వాయిదా వేసినట్టు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న కోడి రామ్మూర్తి స్టేడియం (శ్రీకాకుళం) జరగాల్సి ఉండగా వర్షం కారణంగా వాయిదా వేసినట్టు చెప్పారు. ఈ పోటీలు ఎప్పుడు నిర్వహిస్తామన్నది తిరిగి వెల్లడిస్తామన్నారు.



జాడ గ్రామ సమీపంలో గోతిలో దిగబడిపోయిన కారు



అరిణాం అక్కివలస రోడ్డు దుస్థితి

గోతుల మయంగా..

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- చినుకుపడితే చిత్తడే
- రాకపోకలకు ఇబ్బందిపడుతున్న ప్రజలు

జి.సిగడాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సర్వేశ్వరపురం కూడలి నుంచి మండల కేంద్రానికి సుమారు 15కిలోమీటర్లు బీటీ రహదారి పొడువునా గోతుల మయం కావడంతో చిన్నపాటి వర్షానికి ప్రమాదకరంగా మారుతుంది. గోతుల్లో నీరు చేరడంతో ప్రయాణికులు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ఒక్కోసారి ఈ గుంతల్లో వాహనాలు కూరుకుపోతున్నాయి. గత వైపీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఇటువంటి రహదారులను బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇదేమి రోడ్డు బాబోయ్

ఎచ్చెర్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వర్షం పడిదంటే ఆ రోడ్డుపై ప్రయాణానికి ప్రజలు భయపడుతున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆ గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అరిణాం అక్కివలస గ్రామ పంచాయతీ ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. జాతీయ రహదారికి పట్టుమని రెండు కిలో మీటర్లు కూడా లేని ఈ గ్రామానికి గతంలో వేసిన రోడ్డు పూర్తిగా పాడైంది. రోడ్డు నిండా గుంతలు ఏర్పడడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితిలో ఉంది. పట్టుశాలిపేట, బారికిపేట, అరిణాం అక్కివలస, శేషుపేట తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా రోడ్డు పునరుద్ధరణకు అవసరమైన నిధులు మంజూరుచేయాలని స్థానిక టీడీపీ నేత గట్టెం శివరామ్ కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ పీవోగా రజనీకుమారి



ఇచ్ఛాపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల జూనియర్ కళాశాలకు నూతనంగా జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) యూనిట్ మంజూరైందని కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు తెలిపారు. వృక్షశాస్త్ర అధ్యపకురాలు ఎస్.రజనీకుమారిని ఎన్‌ఎస్‌ఎస్ పీవోగా నియమిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ డి.వనజ నియామక ఉత్వర్వులు జారీ చేశారన్నారు.

రేపు నవల ఆవిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు రాసిన నక్షత్ర బాట నవలను ఈ నెల 22న ఆవిష్కరిస్తామని సాహితీ స్రవంతి కన్వీనర్ కేతిరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కథానిలయంలో మాట్లాడారు. ఏయూ లా కళాశాల రిటైర్డు ప్రొఫెసర్ ఎస్.నిర్మల పాల్గొంటారన్నారు.

నాణ్యతకు నమ్మకానికి చిరునామా సీఎంఆర్

- షాపింగ్‌మాల్ ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు
- సందడి చేసిన సినీనటి శ్రీలీల



సెల్ఫీతీస్తున్న సినీనటి శ్రీలీల



మంత్రి అచ్చెన్నాయుడుకి జ్ఞాపికను అందిస్తున్న సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నాణ్యతకు నమ్మకానికి చిరునామాగా సీఎంఆర్ షాపింగ్ మాల్ నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో అతి పెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ వస్త్ర, బంగారు ఆభరణాల షాపింగ్ మాల్‌ను నగరంలోని జీటీ రోడ్డులో శుక్రవారం మంత్రి అచ్చెన్నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సరికొత్త డిజైన్లతో మార్కెట్‌లోకి సీఎంఆర్ సంస్థ క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సిక్కోలు ప్రజలను పలకరించేందుకు వస్తుందన్నారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ అన్ని వర్గాలను ఆకట్టుకునేలా వివిధ రకాల డిజైన్లతో కూడిన వస్త్రాలను అందుబాటులోకి తేవడం సంతోషమన్నారు. సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ, మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ బాలాజీ మాట్లాడుతూ.. తమ సంస్థను గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. కాగా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో సినీనటి శ్రీలీల సందడి చేశారు. ప్రేక్షకులను పలకరిస్తూ అలరించారు. డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో రూపొందించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' బ్రోచర్‌ను శ్రీలీల ఆవిష్కరించారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. బంగారం తొలి కొనుగోలుదారులు అందవరపు ప్రసాద్, స్నేహలతో పాటు సీఎంఆర్ జనరల్ మేనేజర్ లింగమూర్తి, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు న్యాయ అవగాహన సదస్సు

- జిల్లా జైలును పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి మౌలానా



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంపోలు వద్ద గల జిల్లా జైలులో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా నిందితులతో మాట్లాడి, వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. న్యాయపరమైన సలహాలు, సూచనలను అందించడానికి న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, పి.అజనీకుమార్, పి.హర్షవర్ధన్, వైద్య సిబ్బంది, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తదితరులు పాల్గొన్నారు.

కలాం గురుపురస్కారానికి ఎంపిక



సూర్యారావు

బూర్జ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రాష్ట్రస్థాయి గురుపురస్కార్ అవార్డుకు ఓవీ పేట గ్రామానికి చెందిన బుడుమూరు సూర్యారావు ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకులు చివకుల సాంబశివరావు, పి.వేణు గోపాల్ నుంచి ఆహ్వానం అందింది. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఉత్తమ అధ్యాపకులను, ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్టు ఈ పురస్కారం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురష్కరించుకుని చివకుల హనుమంతురావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా ఈ పురస్కారాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 22న గుంటూరులో జరిగే కార్యక్రమంలో సూర్యారావు ఈ పురస్కారం అందుకోనున్నారు.

ఆదర్శపాఠశాల విద్యార్థుల ప్రతిభ



అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

రణస్థలం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ రాష్ట్ర స్థాయి ప్రతిభా పోటీల్లో కొండములగాం ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ చూపారు. శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు హరీష్, ప్రవీణ్, లతీష్ చైతన్య ప్రోత్సాక బహుమతులు అందుకున్నారు. వీరు షార్ట్ వీడియో పోటీలో ఎస్ఈసీఏ రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరిచారు. ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ అభినందించారు. వీరికి గైడ్ టీచర్‌గా జువాలజీ జ్యోత్స్న వ్యవహరించారు.

డ్రోన్ లేబరేటరీ ఏర్పాటు

ఎచ్చెర్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో అఖిల భారత సాంకేతిక విద్యామండలి, ఏపీవీఎల్ ఇంటర్నేషనల్ గురగాన్ (న్యూఢిల్లీ) సంయుక్తంగా డ్రోన్ లేబరేటరీని ఏర్పాటుకు ఇద్దరు సభ్యులు గల కమిటీ శుక్రవారం కళాశాలను సందర్శించింది. సాగర్ చాబ్రా (ప్రాజెక్ట్ విభాగం వైస్ ప్రెసిడెంట్), సాక్షి (ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్)తో కూడిన బృందం కళాశాల మైదానం, కంప్యూటర్ ల్యాబ్స్, తరగతి గదులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 47 లేబరేటరీల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా ఏపీలో రెండు లేబరేటరీలు మంజూరు కాగా.. వెంకటేశ్వరలో ఒకటి ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం తొలివిడత రూ.35 లక్షలు, రెండో విడతగా రూ.15 లక్షలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు శ్రీరామ్మూర్తి, ఇప్పిలి కిశోర్, బెండి కార్తీక్, ప్రిన్సిపాల్ రమణమూర్తినాయుడు పాల్గొన్నారు.

బీజేపీ నిరంకుశ ధోరణి సరికాదు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అరసవల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ నిరంకుశ ధోరణి సరికాదని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. పార్లమెంట్ వద్ద బీజేపీ నాయకులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ శుక్రవారం స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద ఆందోళన చేపట్టారు. బీజేపీ ఎంపీలు రాహుల్ గాంధీని అడ్డుకుని, దూషించడం దారుణమన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించి హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, నాయకులు కేవీఎల్ఎన్ ఈశ్వరి, అంబటి దాలినాయుడు, సైదుల్లాఖాన్, బాషా, అంబటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం కలగకుండా చూసుకోవాలి



పొలాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారిణి

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో రైతులకు పంట నష్టం కలుగకుండా చూసుకోవాలని మండల ప్రత్యేక అధికారిణి, డ్వామా ఏపీడీ ఆర్.స్వరూపరాణి సూచించారు. శుక్రవారం సింగుపురం, పొన్నాం, నైరా, రాగోలు, గూడాం ప్రాంతాల్లో పర్యటించి పంట పొలాలను డీపీవో భారతి సౌజన్య, ఎంపీడీవో బి.శైలజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించి రైతులకు అండగా నిల వాలని సూచించారు. కళ్లాల్లో నూర్పులు చేసిన ధాన్యాన్ని సక్రమంగా భద్రపర్చుకోవాలన్నారు.

గ్రోయిన్లు బాగుచేయండి

ఇచ్ఛాపురం, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): మరమ్మతులకు గురైన బాహుదా బెల్లుపడ గ్రోయిన్లను బాగు చేయాలని నీటి సంఘ అధ్యక్షు డు కొచ్చర్ల ధనుంజయరెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం బెల్లుపడ చానల్ ను పరిశీలించిన నీటి సంఘ అధ్యక్షుడు తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఏఈని కలిసి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెయ్యి జానకిరావు, ఆర్.శ్రీను, లండ రుక్మందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా కూటమి ప్రభుత్వం: ఎన్ఈఆర్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సంతవురిటి గ్రామానికి చెందిన కరగాన ప్రవల్లికకు మెరుగైన చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును శుక్రవారం పున్నాం గ్రామంలో బాధితురాలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపదలో ఉన్న పేదవారికి, అనారోగ్యంపాలైన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ముందుగా సర్పంచ్ సుంకరి అప్పన్న కుమారుడు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. గ్రామంలో గల సమస్యలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, బూరాడ వెంకటరమణ, వజ్జపర్తి రఘురాం, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, టంకాల మౌళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు మార్పించండి

కవిటి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కవిటిలోని మూడు వీధుల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు పూర్తిగా పాడయాయని, వాటిని మార్పు చేయించాని చిన్న కర్రివాని పాలెం గ్రామస్థులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. శుక్రవారం రామయ్యపుట్టుగలో తన నివాసం ఎమెల్యేను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శుక్రవారం కూడా విద్యుత్ వైరు తెగిపడడంతో అటుగా వెళ్తున్న ఒక మహిళ త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, కూటమి నాయకులు శ్రీనివాస్, పురుషోత్తం, జానీ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న కూటమి నాయకులు

అప్రమత్తంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

ఆమదాలవలస, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి పంచాది రాధ అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీనివాసాచార్యులపేట, బొబ్బిలిపేట, చీమలవలస, కట్యాచార్యులపేట, కొత్తవలస, దూసి, తొగరాం గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రోణంకి వెంకటరావు, ఏవో మెట్ట మోహన్‌రావు, పంచాయతీ సెక్రటరీ బగాది నాగరాజు, వ్యవసా య సచివాలయ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

● అత్తింటివారే చంపేశారని తండ్రి ఆరోపణ


మురళీకృష్ణ (ఫైల్)

పలాస, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్న బడాం గ్రామానికి చెందిన అట్టాడ మురళీకృష్ణ కృష్ణ(29) శుక్రవారం ఉదయం నర్సిపురం గ్రామ సమీపంలోని చెరువు వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెందడం సంచలనం కలిగించింది. కుటుంబ కలహాల కారణంగా ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతుండగా.. అత్తవారింటి వారే తన కుమారుడికి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతుడి తండ్రి అట్టాడ ధర్మారావు ఆరోపిస్తున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. మురళి స్వగ్రామానికి చెందిన ఓ యువతితో మురళీకృష్ణ ప్రేమ వ్యవహారం నడిపించగా ఆమె మైనర్ కావడంతో అతడిపై పోక్సో కేసు బాలిక తల్లిదండ్రులు ఉంటున్న విశాఖపట్నం ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. దీంతో మురళి 45 రోజుల పాటు విశాఖపట్నంలో జైలు శిక్ష అనుభవించాడు. 2022లో ఆ బాలిక మేజర్ అయిన తరువాత టెక్కలిలో ఆమెను మురళీకృష్ణ రిజిస్టర్ వివాహం చేసుకున్నాడు. మురళి దంపతులు గ్రామానికి రాగా యువతిని వారి తల్లిదం డ్రులు తీసు కెళ్లారు. అక్టోబరు ఏడో తేదీన భార్యాభర్తలిద్దరూ విశాఖపట్నం వెళ్లగా మురళీ ఒక్కరే తిరిగి చిన్నబడాం చేరు కున్నాడు. నవంబరు 19న మురళి తన భార్యను కలిసేందుకు విశాఖ వెళ్లగా ఆమె నిరాకరించడంతో పాటు ఇక నీవు వద్దని స్పష్టం చేసింది. దీంతో అప్పటి నుంచి మురళీకృష్ణ స్వగ్రామంలోనే ఇంటి వద్దే చిన్నపనులు చేసుకుంటూ ఉంటున్నాడు. ఇదిలా ఉండగా ఈనెల 18న భార్య ఫిర్యాదుపై మురళీకృష్ణపై కేసు నమోదైందని, విచారణకు రావాలని ఎంవీపీ స్టేషన్ పోలీసుల నుంచి వర్తమానం వచ్చింది. గురువారం ఆయన ఇంటి వద్ద విశాఖపట్నం వెళ్తానని చెప్పాడు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉందని, శుక్రవారం ఉదయం నర్సిపురం గ్రామం వద్ద మురళీకృష్ణ ఉరివేసుకొని చెట్టుకు వేలాడుతున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం రావడంతో తండ్రి హుటాహుటిన వెళ్లి నిర్ధారించుకున్నారు. తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, దర్యాప్తు చేసి న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఏఎస్‌ఐ చంద్రరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

నరసన్నపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామ శివారు మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ పల్లి అశిరినాయుడు తెలిపారు. గత కొన్నాళ్లుగా తోటల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం మాటువేసి పట్టుకున్నారు. వీరి నుంచి రూ.2,160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

న్యాయ సలహాలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

నరసన్నపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఖైదీలకు న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సలహాలను ఉచితంగా అందించడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ జైలును పరిశీలించారు. ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. వారి పరిస్థితులు, బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని అలవరచుకోవాలి: శివాజీ


5కె రన్ విజేతలకు బహుమతులను అందజేస్తున్న గౌతు శివాజీ

పలాసరూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువకులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలని మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ అన్నారు. గురు దాసుపురంలో రాష్ట్ర అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుమ లక్ష్మణకుమార్ తండ్రి నర్సింహమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లా స్థాయి 5కెరన్, విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. విజేతలకు షీల్డ్‌తో పాటు నగదు పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, నేతలు డి.సంతోష్,సొర్ర డిల్లేశ్వరరావు, కుత్తుమ ప్రకాశరావు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ పాఠశాల మంజూరు చేయండి



పాతపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గమైన పాతపట్నానికి జవహర్ నవోదయ పాఠశాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కలిశారు. ఈ సందర్భంగా నవోదయ పాఠశాల కేటాయించాలని వినతిపత్రం అందించారు.

చేపల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

ఆమదాలవలస, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో చేపలు, రొయ్యల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు కేవీకే కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. అనంతరం జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చేపల ఎగుమతి ద్వారా దేశం ఆదాయం పొందుతున్నప్పటికీ దేశీయంగా వినియోగం పెంచడానికి నాణ్యమైన ఉత్పత్తుల తయారీ మార్కెటింగ్ సదుపాయాలు అవసరమని, ఆ దిశగా విజన్ 2047 డాక్యుమెంట్ తయారీ అమలుపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు డాక్టర్ నేతాజీ, మత్స్య శాస్త్రవేత్త సీహెచ్ బాలకృష్ణ, సహాయ సంచాలకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో ఇక్కట్లు

● దారుణంగా తయారైన రోడ్లు
● వాహనదారులకు ఇబ్బందులు

టెక్కలి/వజ్రపుకొత్తూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గడచిన మూడు రోజులుగా కురుస్తున్న అడపాదడపా వర్షాల కారణంతో పలు గ్రామాలు, పట్టణాల్లోని రోడ్లు దారుణంగా తయారయ్యాయి. తుఫాన్ ప్రభావంతో ముసురు ఏర్పడగా కురిసిన వర్షపు నీరు రోడ్లపై నిలిచి, గోతు ల్లో చేరి వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. టెక్కలి, వజ్రపుకొత్తూరు మండలాల్లోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గోతుల్లో నీరు చేరి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



టెక్కలి: నాలుగురోడ్ల కూడలి, గోపీనాథపురం వద్ద రోడ్డుపై గోతుల్లో నిలిచిన నీరు


వజ్రపుకొత్తూరు: బెండి జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై చేరిన వర్షపు నీరు

రైతులకు సహాయకారిగా నిలవండి: మంత్రి అచ్చెన్న


నీటిసంఘాల ప్రతినిధులను అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి/పలాస/వజ్రపుకొత్తూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి నీటిబొట్టు రైతులకు అందించేలా నీటిసంఘాల ప్రతినిధులు కృషి చేయాలని, రైతులకు సహాయకారిగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం పలాస, టెక్కలి, కోటబొమ్మాళి, పోలాకి వజ్రపుకొత్తూరు మండలాల్లోని నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు టీడీపీ నేతలతో మర్యాదపూర్వకంగా కలిశారు. అన్ని నీటి సంఘాలను టీడీపీ కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందని, రైతుల ఆశలను నెరవేర్చాలని సూచించారు. అభివృద్ధికి అవసరమైన నిధులు తాను సమకూరుతానని, రైతులకు ఇబ్బం దులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో కింజరాపు హరివరప్రసాద్, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, వంకల కూర్మారావు, దువ్వాడ హేమబాబుచౌదరి, బోయిన రమేష్, వెలమల కామేశ్వరరావు, గొనప నిరంజన్, నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వన్నె తీసుకురావాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ద్వారా జిల్లాకు వన్నెతెచ్చేలా పని చేయాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బోయిన రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల్లో ధాన్యం ఉంచుకోండి: కలెక్టర్

నరసన్నపేట/పోలాకి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా మరో రెండు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురుస్తాయని.. అందువల్ల రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. శుక్రవారం నరసన్నపేట, పోలాకి మండలాల్లోని మబుగాం, కత్తిరివానిపేట, మాకివలస, దేవాది, కిల్లాం తదితర గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. ధాన్యాన్ని నిలువ చేసుకునేందుకు ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలన్నారు. టార్పాలిన్ల కోసం వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ధాన్యం కుప్పలు ఉన్న పొలాల్లో వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు.

డిపార్టుమెంట్ పరీక్షలు ప్రారంభం

నరసన్నపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ డిపార్టుమెంట్ పరీక్షలు శుక్రవారం స్థానిక కోర్ టెక్నాలజీ కేంద్రంలో ప్రారంభమయ్యాయి. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పదోన్నతి కోసం ఈ పరీక్షలకు హాజరయ్యారు. శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష కూడా పరీక్ష రాశారు. రెండు షిఫ్టుల లో నిర్వహించిన ఈ పరీక్షలకు 350 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.టి.శ్రీకాంత్ పరిశీలించారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

పలాస, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఇలా చేస్తే అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించారు. ఇతరులు విద్యార్థినులపై అసభ్యకరంగా వ్యవహరిస్తే ఆ విషయాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తక్షణం తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్‌సెల్ కన్వీనర్ ఎ.సునీత, ఆర్.దీపకుమారి, కె.రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పాఠశాలల క్రీడల తేదీలు ఖరారు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలోని జిల్లా పాఠశాలల క్రీడలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి, ఫైనల్ బాల, బాలికల ఆటల పోటీల తేదీలను ఖరారు చేసినట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య, డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. జనవరి 2 నుంచి 7వ తేదీలోగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి కవిటి జీహెచ్ఎస్‌లో, పలాసకు సంబంధించి గోవిందపురం జడ్పీహెచ్ఎస్‌లో, టెక్కలికి సంబంధించి జడ్పీ హైస్కూల్ చాకిపల్లిలో, నరసన్నపేటకు సంబంధించి జడ్పీహెచ్ఎస్ మబగాంలో, పాతపట్నానికి సంబంధించి జడ్పీ హెచ్ఎస్ నివగాంలో, శ్రీకాకుళంకు సంబధించి ఎస్ఆర్ ప్రాథమిక స్కూల్ సింగుపురంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో గెలుపొందిన వారికి ఫైనల్‌లో స్థానం కల్పిస్తామన్నారు. ఫైనల్ బాలబాలికల పోటీలు శ్రీకాకుళం టీపీఎం స్కూల్, ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు గ్రిగ్స్ సహాయ కార్యదర్శి కె.మాధవరావు 9441570361 ఫోన్ నెంబరులో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

ధాన్యం కొనుగోలులో ప్రథమ స్థానం: బగ్గు


ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ఇప్పటి వరకు జలుమూరు మండలం జిల్లాలో ప్రథమంగా నిలిచిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే 22 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలబడడం హర్షదాయకమన్నారు. శ్రీముఖలింగం ఎంపీటీసీ కరుకోల హరిప్రసాద్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా గౌరవవేతనం చెల్లించలేదని, తక్షణం వాటిని చెల్లించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, తహసీల్దారు జన్ని రామారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి రోడ్డు పనులు పూర్తి

నరసన్నపేట/పోలాకి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'పల్లె పండుగలో చేపట్టిన రోడ్డు పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నరసన్నపేట, పోలాకి, సారవకోట, జలుమూరు మండలాల్లో ఇంకా ప్రారంభించని పనులు గుర్తించాలన్నారు. జమ్ము పంచాయతీలో పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ సత్యంనాయుడు, ఏఈలు బగ్గు నర్సింగరావు, శ్రీధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ ఫుటేజీలు పరిశీలిస్తే.. వాస్తవాలు వెలుగులోకి?

● పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదంపై అధికారుల ఆరా


కాలిపోయిన పెట్రోల్ పంపు

టెక్కలి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): బీపీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌లో గురు వారం జరిగిన అగ్నిప్రమాదంపై సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే విషయాన్ని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సీఐ మోహనరావుకు ఆదేశించారు. గురువారం రాత్రి తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయిందా, ఫైర్ సేఫ్టీ అనుమతులున్నాయా, ప్రమాదం ఎలా జరిగింది, చివర తనిఖీ ఎప్పుడు చేపట్టారు, రెన్యువల్ అయిందా లేదా తదితర అంశాల్లో లోతుగా విచారణ చేపట్టాలని ఆయా శాఖల అధికారులు ఏడీఈ కృష్ణమూర్తి, ఫైర్‌ఆఫీసర్ కూర్మారావులకు ఆదేశాలి చ్చారు. ప్రమాదం జరిగిన సమయానికి 8 వేల లీటర్ల డీజిల్, 2,600 లీటర్ల పెట్రోల్ ఉన్నట్లు బంకు యజమాని ఆర్డీవోకి వివరించారు. అయితే వీటికి సంబంధించి, సేల్స్ రికార్డులను అధికారులకు చూపించకపో వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంపై సీసీ ఫుటేజీలు వస్తే తప్ప వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదని అధికారులు భావిస్తు న్నారు. అయితే ప్రస్తుతానికి విద్యుత్ సరఫరా లేకపో వడంతో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, విద్యుత్ సరఫరా అయిన తరువాత ఆ వివరాలు తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

టీ20 విజేత ఇచ్ఛాపురం జట్టు


ట్రోఫీ అందుకుంటున్న ఇచ్ఛాపురం జట్టు

ఇచ్ఛాపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన అండర్-14 సౌత్‌జోన్ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఇచ్ఛాపురం జట్టు విజయం సాధించింది. ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొనగా, ఇచ్ఛాపురం ఐసీసీ-తెలంగాణ ఎలైట్ క్రికెట్ జట్లు మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇచ్ఛాపురం జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. 160 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు 108 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌లో ఉత్తమ ఆల్ రౌండర్ ప్రతిభ కనబరిచిన జన్నెల హర్షవర్ధన్‌కు మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ మ్యాచ్‌లు హైదరాబాద్‌లో ఈ నెల 13 నుంచి 20వరకు జరిగాయని ఐసీసీ క్రికెట్ జట్టు కోచ్ డి.గోపి తెలిపారు.

తీరంలో నిత్యం నిఘా ఉండాలి

● కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీ రవివర్మ


సోంపేట: రికార్డులను పరిశీలిస్తున్న కోస్టల్ ఎస్పీ

సంతబొమ్మాళి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో నిత్యం నిఘా ఉంచడంతో పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీ పీవీఆర్ఎస్ఎస్ఎంవీ రవివర్మ ఆదేశించారు. శుక్రవారం భావనపాడు మెరైన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. తుఫాన్ వంటి సమయాల్లో తీరప్రాంత ప్రజలను అప్ర మత్తం చేయాలని కోరారు. మెరైన్ సీఐ డి.రాము పాల్గొన్నారు.

మెరైన్ పోలీస్ స్టేషన్ తనిఖీ

సోంపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీ రవివర్మ శుక్రవారం బారువ మెరైన్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పనితీరుపై ఆరా తీస్తూ రికార్డులు పరిశీలించారు. దత్తత గ్రామాల్లో పరిస్థితిపై సీఐ రమేష్ కుమార్‌ను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శిరీష, శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాఠశాలలు రెన్యూవల్ చేసుకోవాలి

టెక్కలి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి, పలాస విద్యాశాఖ డివిజన్ల పరిధిలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తమ గుర్తింపును ఈనెల 31లోగా రెన్యూవల్ చేసుకోవాలని డిప్యూటీ డీఈవో పి.విలియమ్స్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సంబంధిత రెన్యూవల్ పత్రాలను డీఈవో కార్యాలయానికి సమర్పించాలని కోరారు. గడువు తరువాత వచ్చిన దరఖాస్తులు పరిశీలించడం జరగదని, అటువంటి పాఠశాలలకు గుర్తింపు రద్దు చేయడం జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

పోలాకి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, తుఫాన్ కారణంగా వేటకు వెళ్లని మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రాజారాంపురం మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు కోడ తాతారావు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను, ముఖ్యంగా రాజారాంపురం సాగరతీర అభివృద్ధిని విస్మరించిందన్నారు. రాజారాంపురానికి ఫిషింగ్ యార్డ్, చేపలు ఎండబెట్టేందుకు వీలుగా రచ్చబండలు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు మత్స్యకారులను అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు.

డబారుసింగికి హాస్టల్ మంజూరు

మందస,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డబారు సింగికి పీఎం జన్‌మన్ కింద హాస్టల్ మంజూరైందని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు తెలిపారు. గిరిజన గ్రామాల్లో విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సర్వశిక్షాఅభియాన్ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం మొదటగా రూ.2.30 కోటతో 60 బెడ్ల హాస్టల్ మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దిలీప్‌కుమార్, హరీకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపు చేయాలి

కాశీబుగ్గ,డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపు చేయాలని ఉపాధ్యాయులు సూచించారు నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ దినోత్సవంలో భాగంగా కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏపీఈఎడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'శక్తి వనరులు-సంరక్షణ' అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ నాగభూషణరావు, ఉపాధ్యాయులు వెంకటరావు, లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో రికార్డుల పరిశీలన

నందిగాం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖకు సంబంధించి రికార్డులను శుక్రవారం పరిశీలిం చారు. జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య ఆదేశాల మేరకు 2021-22 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జరిగిన వివిధ రకాల అంశాలపై డీఈవో కార్యాలయ సిబ్బంది సూర్యప్రకాష్, కె.రామ్మూర్తి పరిశీలించారు. మూడురోజుల పాటు ఈ రికార్డుల పరిశీలన ఉంటుందని వారు తెలిపారు. ఎంఈవో జి.నర్సింహులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ఎ.ప్రసాదరావు, సీవో ఎం.ఉమాపతి పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులను పొందాలి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేపలవేట చేస్తున్న ప్రతి మత్స్యకారుడు గుర్తింపు కార్డు పొందాలని మండల మత్స్యశాఖాధికారి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం చినకొత్తూరులో మత్స్యకారులను కార్డులను అందించారు. మండలంలో 75 శాతం మందికి కార్డులు ఇచ్చినట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా జాబితాలో లేకుంటే తక్షణమే సంప్రదించాలని కోరారు.

గొట్టిపల్లి వసతిగృహం తనిఖీ


వంట వస్తువులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నీరజ

కొత్తూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గొట్టిపలి ట్రైబల్ వెల్ఫేర్ వసతిగృహాన్ని ఎంపీడీవో నీరజ శుక్రవారం తనిఖీ చేశారు. వంటగది పరిసరాలు, విద్యార్థులకు అందించే మెనూను పరిశీలించారు. భోజనం పదార్థాలను రుచి చూశారు. నీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ శుభ్రంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు డైనింగ్ హాల్ లేకపోవడం గుర్తించారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితా

గుజరాతీపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆమదాలవలస, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొ రేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న పాఠశాల సహాయకులు పోస్టులు పదోన్నతి కోసం అర్హులైన ఎస్‌జీటీ, తత్సమాన కేడర్ ఉపా ధ్యాయుల జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలియజేశారు. వాటిపై ఎటువంటి అభ్యంతరాలున్నా ఈ నెల 23వ తేదీలోగా తన కార్యాలయానికి తెలియజేయాలని ఆయన కోరారు.